అన్నాచెల్లెళ్ల బంధానికి రాఖీ ప్రతీక: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రాఖీ పండుగను పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అభిమానం, ప్రేమతో రాఖీలు కట్టిన సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల బంధానికి రాఖీ పండుగ ప్రతీక అని, ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళల శ్రేయస్సు, భద్రత కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

అండగా నిలిచిన అన్నకు ఆప్యాయంగా..!

- కేటీఆర్‌కు రాఖీ కట్టిన మహిళాలోకం
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన ఆడబిడ్డలు
- రాఖీకట్టిన రుద్రరచన, జోహాన్‌ఖాన్ తల్లి, కృతిక

కేటీఆర్‌కు బొట్టుపెట్టి రాఖీ కడుతున్న బీఆర్ఎస్ మహిళానేతలు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత పదేండ్లలో వ్యక్తిగతంగా, మంత్రిగా వేల మందికి అనేక సందర్భాల్లో తనకు తోచిన సాయం, సహకారం అందించారు. ఈ నేపథ్యంలో కొందరు రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో కేటీఆర్ నివాసానికి వచ్చి మరీ రాఖీ కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. జగిత్యాలకు చెందిన అనాథ విద్యార్థిని రుద్రరచన ఇంజినీరింగ్ సీటు సాధించింది. ఆమె ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని చదువు కోసం కేటీఆర్ పూర్తి ఖర్చులు భరించారు. ప్రస్తుతం ఆమె కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. కేటీఆర్ చేసిన సాయానికి కృతజ్ఞతగా గతేడాది ఆమె తన 3 నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చింది. ఈసారి ఆమె కేటీఆర్‌ను కలిసి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకున్నది.

- హైదరాబాద్ బోరబండకు చెందిన ఐదేండ్ల జోహాన్‌ఖాన్ పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కేటీఆర్.. చికిత్సకు సామమందించారు. తన కొడుకుకు భవిష్యత్తును అందించారని జోహార్‌ఖాన్ తల్లి కేటీఆర్ నివాసానికి వచ్చి రాఖీ కట్టారు.
- హైదరాబాద్‌కు చెందిన ఐదేండ్ల బాలిక కృతిక.. వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడితే కేటీఆర్ ఆమె ఆపరేషన్లకు సాయం అందించారు. ఆమె కేటీఆర్‌కు రాఖీ కట్టి ధన్యవాదాలు తెలిపింది.
- ముస్లిం మహిళలు సైతం కేటీఆర్‌కు రాఖీ కట్టేందుకు పోటీపడ్డారు.

తరలివచ్చిన ఆడబిడ్డలు

మాజీమంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, హరిప్రియానాయక్, తుల ఉమ, గండ్ర జ్యోతి, గుజ్జ దీపిక, ముక్తవరం సుశీలారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, కేటీఆర్‌కు రాఖీ కట్టారు. ప్రతి సోదరికి శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, తన సోదరి కవిత రాఖీ కట్టే పరిస్థితి లేకపోవటంపై ఆవేదన చెందారు.

నీకు ఏ కష్టమొచ్చినా నేను అండగా ఉంటా

కవితను తలచుకుంటూ కేటీఆర్ ఉద్విగ్న పోస్ట్

రాఖీ పండుగ సందర్భంగా తన సోదరి కవితను తలచుకుంటూ కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. 'ఈ రోజు నువ్వు రాఖీ కట్టలేకపోవచ్చు. కానీ, నీకు ఏ కష్టమొచ్చినా నేను అండగా ఉంటా' అని పేర్కొంటూ గతంలో కవిత తనకు రాఖీ కట్టిన ఫొటోను, కవిత పిడికిలి ఎత్తిన ఫొటోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

రాజీవ్ విగ్రహం తీసేస్తం

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ సర్కారు నిర్మించిందని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా సచివాలయం ఎదురుగా ఒక ఐలాండ్‌ను క్రియేట్ చేశామని, దశాబ్ది ఉత్సవాల్లోనే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టామని, ఆ మహనీయుడికి ఘనమైన నివాళి అర్పించేలా అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తుచేసేలా అమరజ్యోతి స్మారకాన్ని నిర్మించామన్నారు.

తెలంగాణ అస్థిత్వానికి కాంగ్రెస్ అవమానం

కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు మాజీ సీఎం అంజయ్య పేరుతో ఉన్న పార్కు కాస్తా లుంబిని పార్కు అయ్యిందని, అదే అంజయ్య పార్కు ఎదురుగా ఆయనను అవమానించిన రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు.

పదేండ్లలో పేర్ల మార్పుపై ఆలోచంచలేదు

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏనాడూ పేర్ల మార్పుపై ఆలోచించలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వ పథకాలు, ప్రాంతాలకు కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నా వాటిని మార్చే ప్రయత్నం చేయలేదని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, రాజీవ్‌గాంధీ ట్రిపుల్ఐటీ, రాజీవ్ గాంధీ ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్–కరీంనగర్ రహదారికి రాజీవ్ రహదారి, అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం.. ఇలా ఎన్ని పేర్లున్నా వాటిని తాము మార్చలేదని చెప్పారు. కానీ తెలంగాణ తల్లిని అవమానించిన తర్వాత బాధతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తరలిస్తామని చెప్తున్నామని వివరించారు. ఢిల్లీకి గులాములుగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ పౌరుషం కలిగిన బిడ్డగా చెప్తున్నానని.. ఆ విగ్రహాలను మార్చే దిశగా ఆలోచన చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ పేర్లతో ఉన్న పథకాలు, ప్రాంతాల పేర్లను కూడా మారుస్తామని తెలిపారు. హైదరాబాద్ విమానాశ్రయానికి తెలంగాణ ప్రముఖుడి పేరు పెడతామని వెల్లడించారు. ముంబై విమానాశ్రయానికి ఛత్రపతి శివాజీ, బెంగళూరు విమానాశ్రయానికి కెంపెగౌడ అని పేర్లు ఉన్నాయని.. తెలంగాణకు సంబంధం లేని రాజీవ్‌గాంధీ పేరున్నా తాము తొలగించలేదని గుర్తుచేశారు.

కాంగ్రెస్ పాలనలో అఘాయిత్యాలు

ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళల మీద జరిగిన అఘాయిత్యాలు ఇప్పుడు గుర్తుకు వచ్చినందుకు మంచిదేనని కేటీఆర్ అన్నారు. కొల్లాపూర్‌లో చెంచు మహిళ, షాద్‌నగర్‌లో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినా ప్రభుత్వం దున్నపోతుపై వానపడ్డట్టు వ్యవహరించిందని, మహిళా మంత్రులు స్పందించలేదని మండిపడ్డారు. తమ మాజీ మంత్రులు షాద్‌నగర్‌కు వెళ్లాకే పోలీసులను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇంకా ఎన్నో అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి హోంమంత్రి దిక్కులేరని ధ్వజమెత్తారు. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్య ఘటనపై ఢిల్లీలో డాక్టర్లు నిందితుడికి తెలంగాణ తరహా శిక్ష విధించాలని అడుగుతున్నారని, దటీజ్ కేసీఆర్ అని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బిక్షమయ్యగౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, అంజనేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు పూలదండ కూడా వేయని సీఎం రేవంత్

కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఏనాడు అనడని, మహనీయుడు అంబేద్కర్‌కు కనీసం పూలదండ వేయడని, విగ్రహానికి ప్రముఖ రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేయని కుసంస్కారి అని కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద మెప్పు కావాలంటే.. రాహుల్ దగ్గర మార్కులు కొట్టేయాలనుకుంటే.. గాంధీభవన్‌లోనో, రేవంత్ ఇంట్లోనో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకొంటే తమకు అభ్యంతరం లేదని స్పష్టంచేశారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలన భేష్!

కొనియాడిన శ్రీలంక మంత్రి సతాశివన్

- హైదరాబాద్‌లో కేటీఆర్‌తో ప్రత్యేక భేటీ
- రాజధానిని అక్షయపాత్ర చేశారని కితాబు
- తెలంగాణ ప్రగతిపై శ్రీలంక పార్లమెంట్‌లో చర్చ
- భేటీ సమయంలో నెమరు వేసుకున్న శ్రీలంక మంత్రి



కేటీఆర్‌ను కలిసిన శ్రీలంక మంత్రి సతాశివన్ వియలందేరన్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో అద్భుత ప్రగతి సాధించిందని శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల మంత్రి సతాశివన్ వియలందేరన్ కొనియాడారు. సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేవలం పదేండ్లలోనే సాధించిన అద్భుత ప్రగతి గురించి గతంలో తాను శ్రీలంక పార్లమెంట్‌లో ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్‌తో పంచుకున్నారు. హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల అభివృద్ధిని సింగపూర్‌ను తలపించేలా ఉన్నదని ప్రశంసించారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన తీరును సతాశివన్ అభినందించారు. ఓవైపు ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోతుంటే పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌ను అవకాశాల అక్షయపాత్రగా మార్చిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణలో ఓవైపు ఐటీ, మరోవైపు తయారీరంగం, ఇంకోవైపు ఫార్మా రంగాలకు ఏకకాలంలో పెద్దపీట వేసి పారిశ్రామిక రంగాన్ని మెరుపువేగంతో పరుగులు పెట్టించడం అరుదైన విషయమని కొనియాడారు. హైదరాబాద్ వంటి నగరాలే ఏ దేశానికైనా ఆర్థిక ఇంజిన్లని, వీటిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుందని చెప్పారు. తాను చెన్నైలో పర్యటించానని, తమిళనాడు కంటే తెలంగాణ పోలీసులకే ఎక్కువ వేతనాలు అందుతున్నాయనే విషయాన్ని అక్కడి పోలీస్ అధికారి తనకు చెప్పిన విషయాన్ని సతాశివన్ గుర్తుచేశారు.

పదేండ్లపాటు యజ్ఞంలా ప్రగతి: కేటీఆర్

తెలంగాణలో గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనను ఓ యజ్ఞంలా సాగించామని, అందుకే అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు సాధించగలిగామని భేటీ సందర్భంగా శ్రీలంక మంత్రి సతాశివన్‌కు కేటీఆర్ వివరించారు. రాష్ట్రానికి గుండెకాయ వంటి హైదరాబాద్‌లో సంపదను సృష్టించి సంక్షేమం రూపంలో పల్లెపల్లెనా పేదలకు పంచామని చెప్పారు. పారిశ్రామిక రంగానికే కాదు పర్యావరణానికీ సమప్రాధాన్యం ఇచ్చామని, తెలంగాణలో 7.7 శాతం గ్రీన్ కవర్‌ను పెంచడం దేశంలోనే అరుదైన రికార్డు అని గుర్తు చేశారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం మానవ చరిత్రలోనే మూడో అతిపెద్ద ప్రయత్నమని వెల్లడించారు. చిన్న వయసులోనే శ్రీలంక ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎదిగిన సతాశివన్‌ను కేటీఆర్ అభినందించారు. భేటీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

గౌడన్నలను అవమానించిన సీఎం

- ఉద్దేశపూర్వకంగానే పాపన్న జయంతికి గైర్హాజరు
- క్షత్రియసభకు వెళ్లిన సీఎం ఇక్కడికి ఎందుకు రాలేదు?
- గౌడన్నలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్నమాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకాకపోవడం రాష్ట్రంలోని గౌడన్నలను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. గౌడన్నలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి సీఎం సమయం ఇచ్చి చివరి నిమిషంలో హాజరుకాకపోవడంతో గౌడ గుండెలు మండిపోతున్నాయని చెప్పారు. ఆదివారం ఉదయం ఎలాంటి ఇతర కార్యక్రమాలు లేకపోయినా కూడా ఉద్దేశ పూర్వకంగానే హాజరుకాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. సీఎం హాజరుకాకపోవడం బహుజనులందరిని అవమానపర్చడం, కించపర్చడమేనని అన్నారు. సీఎంకు క్షత్రియ సభకు హాజరుకావడానికి సమయం ఉంటుంది, కానీ గౌడ్‌లు పూజించే సర్వాయి పాపన్న జయంతికి హాజరుకావడానికి సమయం ఉండదా అని ప్రశ్నించారు. గౌడ్‌లకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఇంతవరకు అమలు కాలేదని చెప్పారు. గౌడలకు అందిస్తున్న మోకు కూడా బీఆర్ఎస్ హయాంలోనే తయారు చేసిందని తెలిపారు. గౌడన్నలు ప్రమాదవశాత్తు చనిపోతే అందించే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని పెంచుతామని ప్రకటించారని, వైన్స్‌లో గౌడ్‌లకు రిజర్వేషన్లను 25 శాతానికి పెంచుతామన్నారని, కానీ ఇంతవరకు అమలు చేయడంలేదని మండిపడ్డారు. శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీది సంకుచిత సర్కార్ అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్వాయి పాపన్న జయంతికి హాజరుకాకపోవడం బలహీనవర్గాలకు చేసిన అతి పెద్ద గాయమని వ్యాఖ్యానించారు. క్షత్రియ సభకు హాజరై రీల్ హీరోలు కృష్ణంరాజు, ప్రభాస్, రామ్‌గోపాల్ వర్మలను సీఎం పొగిడారని, కానీ రియల్ హీరో సర్దార్ పాపన్న జయంతికి హాజరుకాలేదని మండిపడ్డారు. రేవంత్‌కు ఆత్మసాక్షి లేదు, సామాజిక స్పృహకూడా లేదని అన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెంచుతున్నారని, కల్లు దుకాణాలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ వైఖరిలో మార్పు రాకుంటే అగ్గిబరాటలవుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇంజినీరింగ్ సీట్లు పెరిగితే బడుగు బలహీనవర్గాలు చదువుకుంటారన్న ఉద్దేశంతో అడ్డుపుల్లలు వేస్తుందని అన్నారు. సీఎస్ఈలో సీట్లు పెరగకుండా కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. సీఎస్ఈలో సీట్లు పెంచకుంటే ఉన్నత విద్యామండలిని ముట్టడిస్తామని ఆయన ప్రకటించారు.

గురుకులాల్లో 36మంది చనిపోయారు

- 800 మంది అనారోగ్యానికి గురయ్యారు
- ఇకనైనా మెస్ చార్జీలను పెంచండి
- డిప్యూటీ సీఎం భట్టికి ఆర్ కృష్ణయ్య వినతి

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు లేక, కలుషిత ఆహారం బారినపడి 36మంది విద్యార్థులు ఇప్పటికే చనిపోయారని, 800మంది అనారోగ్యానికి గురయ్యారని, ఇకనైనా మెస్‌చార్జీలను పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం నేతలు రామకృష్ణ, రాజేందర్, రామ్మూర్తితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సెక్రటేరియట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అమ్మాయిలకు పాకెట్‌మనీ రూ.1000 ఇవ్వాలని, గురుకులాలు, హాస్టళ్లలో వసతులను మెరుగుపరచాలని విజ్ఞప్తిచేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

వక్ఫ్ బిల్లుకు బీఆర్ఎస్ వ్యతిరేకం

- మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నదని మాజీ మంత్రి మహమూద్ అలీ వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలుచేయడమే కాకుండా వక్ఫ్ బోర్డు భూములను రక్షించామని గుర్తు చేశారు. బీజేపీ తెచ్చిన బిల్లును దేశంలోని అన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ ఎన్నో ఏండ్లు అధికారంలో ఉన్నాయని, కానీ ముస్లింల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లిం మంత్రి ఒక్కరు కూడా లేరన్నారు. కేసీఆర్ మైనార్టీలకు డిప్యూటీ సీఎం రెవెన్యూ, రెండోసారి హోం శాఖ వంటి కీలక పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. నలుగురు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తారని తెలిపారు. జేపీసీకి తమ పార్టీ అభిప్రాయాలు చెప్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ సలీం మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో కలెక్టర్‌కు అధికారం ఇచ్చారని, వక్ఫ్ ప్రాపర్టీకి అల్లానే యజమాని అని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కూడా బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

పెండ్లిమడుగు..మాఫీ మళ్లీ అడుగు

- గ్రామంలో 70 శాతం మంది రుణమాఫీకి దూరం
- 553 మందిలో 200 మందికే లబ్ధి

స్పీకర్ ఇలాకాలో రైతుకు ధోకా!

వికారాబాద్, ఆగస్టు 19, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షలలోపు రుణమాఫీ పూర్తయిందని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రుణమాఫీ పూర్తైందని ప్రగాల్భాలు పలుకుతున్నా.. రుణమాఫీ కోసం రైతులు వ్యవసాయాధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇలాకాలోనూ రైతులు రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామంలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతుల్లో 70 శాతం మంది మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులు 583మంది ఉండగా, వీరిలో 200లలోపు మంది రైతులకే రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా రైతులు అర్హులైనా రుణమాఫీకి దూరం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పెండ్లిమడుగులో రూ.2 లక్షలకుపైన రుణాలున్న రైతులు 20మంది వరకు ఉన్నారు. రేషన్‌కార్డు లేదని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతోనే రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నట్టు రైతులు చెబుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలకు వెళ్తే వివరాలు తీసుకుంటున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని పెండ్లిమడుగు రైతులు పేర్కొంటున్నారు. రేషన్‌కార్డు మెలిక పెట్టి తమకు అన్యాయం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.25 వేలున్నా మాఫీ కాలేదు

నాకున్న ఎకరన్నరపై 25 వేల రుణం తీసుకున్నా. మొదటి విడతలోనే మాఫీ కావాల్సింది. రేషన్‌కార్డు లేక మాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను అడిగితే కుటుంబ నిర్ధారణ కాలేదని చెప్పారు. మా అమ్మ, నాన్న పేరిట 2 లక్షల రుణం తీసుకోగా, ప్రస్తుతం 2.03 లక్షలు అయ్యింది. పైన డబ్బు చెల్లిస్తేనే మాఫీ అవుతుందని చెబుతున్నారు.

- నారెగూడెం విఠల్ రెడ్డి, పెండ్లిమడుగు, వికారాబాద్

అధికారుల నిర్లక్ష్యంతోనే..

నాకున్న రెండెకరాల 24 గుంటల భూమిపై రూ.22 వేల రుణం తీసుకున్నాను. కానీ రుణమాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను వెళ్లి అడగగా రెన్యూవల్ చేసుకోలేదని సమాధానం చెబుతున్నారు. రెన్యూవల్ చేసుకున్నప్పటికీ సొసైటీ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతోనే నేను తీసుకున్న రుణం మాఫీ కాలేదు.

- దుర్గంచెరువు బందిరెడ్డి, పెండ్లిమడుగు, వికారాబాద్

కేసీఆర్ మాఫీ చేసిండ్రు...

కేసీఆర్ ఉన్నప్పుడు రూ.30 వేల రుణం మాఫీ అయ్యింది. ఏటా రెన్యూవల్ చేసుకోవడంతోపాటు మళ్లీ కొత్తగడి సొసైటీ బ్యాంకులో 30 వేల రుణం తీసుకున్నా. ఇరవై రోజులుగా ఆఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా. వ్యవసాయాధికారులను అడిగి తే రెన్యూవల్ చేసుకోలేదని సమాధానం చెప్తున్నారు.

- ఎం.జంగయ్య, పెండ్లిమడుగు, వికారాబాద్

జీవో 29ని రద్దు చేయాలి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగులో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగురూరల్, ఆగస్టు19: గ్రూప్–1 మెయిన్ అభ్యర్థులకు తీరని అన్యాయం చేసే జీవో నంబర్ 29ని తక్షణమే రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ప్రాంగణంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రూప్–1 ఓపెన్ క్యాటగిరీ పోస్టులకు 1:50 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాలో ఎంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల వర్గాలకు చెందిన వారు ఉన్నారో ప్రభుత్వం బయటపెట్టాలని నిలదీశారు. జీవో నంబర్ 46 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి

బానోత్ శ్రీను(ఫైల్)

బానోత్ షమీన(ఫైల్)

కారేపల్లి, ఆగస్టు 19: విద్యుదాఘాతంతో దంపతులు మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపురంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన బానోతు శ్రీను(42), షమీన(40) 20 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కూతురు ఉంది. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం షమీన బట్టలను ఇంటి ఎదుట ఉన్న ఇనుప తీగ(దండెం)పై ఆరేస్తుండగా.. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే పడిపోయింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షమీన అప్పుడప్పుడు స్పృహతప్పి పడిపోతూ ఉండేది. గమనించిని ఆమె భర్త శ్రీను.. షమీన అలాగే పడిపోయిందనుకొని తన భార్యను లేపేందుకు యత్నించాడు. దీంతో అతడికి కూడా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. గమనించిన శ్రీను స్నేహితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ దంపతులను వెంటనే ఇల్లెందు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కుమార్తె ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్సై రాజారాం తెలిపారు.

నీరుగారిన 'మహాలక్ష్మి' ఆశలు

- రాఖీ రోజున ప్రకటిస్తారని భావించిన మహిళలకు నిరాశ
- 8 నెలలైనా ఎందుకు అమలు చేయడం లేదు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హామీల్లో భాగంగా నెలకు రూ.2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకాన్ని రాఖీ పండుగనాడు ప్రకటిస్తారని ఎదురుచూసిన మహిళాలోకానికి నిరాశే ఎదురైందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మహిళాలోకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర